# ఫోబియా

జి. మేరీకృపాబాయి

**రకరకాల ఆలోచనలతో శరత్‌చంద్ర మనసంతా నిండిపోయింది. గంట నుండీ పదేపదే ఆలోచిస్తున్నాడు శరత్‌చంద్ర. అయినప్పటికీ అతనికి సమాధానం దొరకలేదు. అతని సమస్యకు పరిష్కారం ఎక్కడైనా దొరుకుతుందేమోనని ఎన్నో మాగజైన్స్ తిరగేసాడు. రకరకాల పత్రికలు పరిశీలించాడు. చివరికి ఒక పత్రికలో అతని సమస్యకు సమాధానం దొరికింది.**



'యస్! ఇలా తనకు ప్రతిరోజూ వచ్చే తలనొప్పికి కారణం బ్రెయిన్ ట్యూమర్ అయి ఉంటుంది.' మనసులోనే అనుకున్నాడు శరత్‌చంద్ర.

పదిరోజులుగా శరత్‌చంద్ర తల నొప్పితో బాధపడుతున్నాడు. తల నొప్పికి కారణం ఏమిటో అతనికి అంతుబట్టకుండా ఉంది. డాక్టర్ దగ్గరకు వెళ్లాలంటే భయం. కారణం డాక్టర్ ఏమి చెబుతాడోనని భయపడ్డాడు శరత్‌చంద్ర. పత్రికలలో డాక్టర్ సలహా కాలమ్స్ అన్నీ వెతుకుతూ వచ్చాడు. చివరికి ఒక చోట తను చదివిన మెడికల్ సలహాతో తన బాధను పోల్చిచూసుకుని–చివరకి తనకు బ్రెయిన్ ట్యూమర్ అనే నిర్ధారణకొచ్చేశాడు– శరత్‌చంద్ర.

'అవును ఈ తలనొప్పికి కారణం బ్రెయిన్ ట్యూమర్ అయి ఉంటుంది.' మరోసారి అనుకున్నాడు.

'ఒకసారి డాక్టర్ దగ్గరకు వెళితేనో' అనుకున్నాడు. కాని అతని మనసు ఒప్పుకోలేదు.

'ఊహు.. ఒక వేళ డాక్టర్ ఏమైనా భయంకరమైన వ్యాధి అని చెబితే తను తట్టుకోలేడు.' మనసులోనే అనుకున్నాడు శరత్‌చంద్ర.

ఇంతలో కాలింగ్ బెల్ మ్రోగింది. తలుపు తెరిచాడు. ఎదురుగా అతని స్నేహితుడు రమణ.

''హలో రమణా...రా కూర్చో. ప్రొద్దున్నే ఏమిటిలా వచ్చావు?'' అన్నాడు శరత్‌చంద్ర.

''ఈరోజు నీకు బాంక్ ఇంటర్వ్యూ ఉంది కదా! గుర్తుచేద్దామని వచ్చాను.'' అన్నాడు రమణ.

''నాకు ఇంటర్వ్యూకి వెళ్లాలనిపించట్లేదురా'' నిరుత్సాహంగా అన్నాడు శరత్‌చంద్ర.

''అదేమిటి? ఏమైంది?'' అనన్నాడు రమణ.

''నా హెల్త్ ఏమీ బావుండలేదు.'' అన్నాడు.

''అదే ఏమైందని అడుగుతున్నాను.''

''తల నొప్పిగా ఉంటోంది. చాలా విసుగ్గా కూడా ఉంది.'' అన్నాడు బాధగా.

ఏం మాట్లాడాలో అర్థం కాక మౌనంగా నిష్క్రమించాడు రమణ.

'బ్రెయిన్‌ట్యూమర్‌తో బాధపడే నాలాటి వాడికి ఇంటర్వ్యూలెందుకు?' నిరుత్సాహంగా అనుకున్నాడు శరత్‌చంద్ర.

***

మరోవారం రోజులు గడిచాయి. శరత్‌చంద్ర తలనొప్పి కాస్త తగ్గినట్లుగా అనిపించింది, తలనొప్పి విషయంలో కాస్త రిలీఫ్‌గా అనిపించింది. కానీ మరో సమస్య వచ్చిపడింది. అది అతనికి గొంతు మింగుడు పడకపోవడం.

'తలనొప్పి కాస్త తగ్గిందనుకుంటే మళ్లా ఈ గొంతు సమస్య వచ్చిపడింది. ఈ గొంతు నొప్పికి కారణమేమిటో! ఏ టాబ్లెట్స్ వేసుకున్నా, నొప్పి తగ్గట్లేదు. బహుశా గొంతు కేన్సర్ కాదు కదా!'...అనుకుంటూ ఆందోళనలో పడిపోయాడు శరత్‌చంద్ర.

తనకు గొంతు కేన్సరేమోననే భయంతో మానసికమైన ఆందోళనతో చిక్కి శల్యమైపోయాడు శరత్‌చంద్ర.

'పోనీ ఒకసారి డాక్టర్ దగ్గరకు వెళితే బావుంటుందేమో' అని కాసేపు అనుకున్నాడు.

'అమ్మో! డాక్టర్ ఏధైనా చెప్పకూడనిది చెబితే తను తట్టుకోగలడా? ఊహుఁ...తట్టుకోలేడు. అందువలన డాక్టర్ దగ్గరకు వెళ్లకూడదు.' అని గట్టిగా నిర్ణయించుకున్నాడు.

గొంతు నొప్పితో ఏంచేయడానికి పాలుపోక డాక్టర్ దగ్గరకు వెళ్లడానికి భయపడి అలానే కాలం వెళ్లబుచ్చుతున్నాడు.

గొంతునొప్పి ఏమైనా తగ్గుముఖం పడుతుందేమోనని ఎదురుచూడసాగాడు. కానీ నాలుగు రోజుల్లో ఇంకా ఎక్కువైంది. శరత్‌చంద్రలో మళ్లీ ఆందోళన మరీ ఎక్కువైంది. రెగ్యులర్‌గా డ్యూటీకి వెళ్లడానికి కూడా అతనిలో ఆసక్తి నశించిపోయింది. చాలా నిరుత్సాహంగా, అనాసక్తిగా తయారయ్యాడు.

ఎంతకీ గొంతు నొప్పి తగ్గకపోయేసరికి మళ్లా రకరకాల మాగజైన్స్ తిరగేసి.. తనకు గొంతు నొప్పి-కేన్సర్ వల్లనే అని నిర్ధారించుకున్నాడు. దానితో డిప్రెషన్ మరీ ఎక్కువైంది.

ఇంతలో ఫోన్ రింగవడంతో వెళ్లి మాట్లాడాడు. ఆ ఫోన్ కాల్ శరత్‌చంద్ర తల్లిదండ్రులనుంచి.

శరత్‌చంద్రకు పెళ్లి చూపులంటూ వాళ్లు ఫోన్‌లో చెప్పారు ప్రస్తుతం తను బిజీవర్క్‌లో ఉన్నానని ఇప్పుడు వీలు కాదని చెప్పి తప్పించుకున్నాడు.

'తనకు గొంతు నొప్పి బహుశా కేన్సర్ వల్లనే అయివుంటుంది. అందువలన ఇప్పట్లో పెళ్లి ఆలోచన పెట్టుకోకూడదు.' అనుకుంటూ గట్టిగా తీర్మానించుకున్నాడు.

రకరకాల అనుమానాలతో అతని జీవితం నిస్తేజంగా తయారైంది. తనలో ఏదో భయంకరమైన అనారోగ్యం ఉందని శరత్‌చంద్ర నమ్మకం. అందువల్లనే ఏపనీ చేయలేకపోతున్నాడు. చేస్తున్న ప్రైవేటు ఉద్యోగం మీద కూడా ఆసక్తి లేదు. అయినప్పటికీ డాక్టర్‌దగ్గరకు వెళ్లాలంటే భయం పట్టుకుంది. అందువల్ల డాక్టర్ దగ్గరకు వెళ్లే ప్రయత్నం వాయిదా వేస్తున్నాడు. ఆరోజు డ్యూటీకి త్వరగా వెళ్లాల్సి వచ్చి పెందరాడే లేచాడు. బెడ్‌పైనుండి లేవగానే తలతిరిగినట్లనిపించింది. తూలిపడబోయాడు. వెంటనే నిలదొక్కుకుని బెడ్‌ని పట్టుకుని బెడ్‌పై కూర్చున్నాడు. వెంటనే శరత్‌చంద్రని రకరకాల అనుమానాలు వేధించసాగాయి.

'ఏమిటీ తనకీ తలతిరగడం? ఇది ఏ అనారోగ్యానికి చిహ్నం? అసలు తనీ వయసులో ఇంతగా నీరసించిపోవడం ఏమిటి? తన తలలో ఏదైనా ప్రాబ్లమ్ ఉందా? అది మామూలు ప్రాబ్లమా? లేక సీరియస్సా? తను తల తిరిగి క్రింద పడబోయాడు. బహుశా ఇది చాలా సీరియస్ ప్రాబ్లమే అయివుంటుంది. తన నెర్వస్ సిస్టమ్‌లో ఏదో లోపం వుండివుంటుంది. అది ముందు ముందు ఇంకా దేనికి దారి తీస్తుందో. తను ఇంకా బలహీనమైపోతాడేమో!' అనుకుంటూ తనలో తనే కుంగిపోసాగాడు.

కాసేపు అలాగే కళ్లు మూసుకుని బెడ్‌మీద పడుకుండిపోయాడు. రకరకాల ఆలోచనలు మళ్లీ మెదడును తొలిచివేస్తున్నాయి.

అసలు ఒకసారి డాక్టర్ దగ్గరకు వెళితేనో! అతను ఏమి చెప్పినా ధైర్యంగా ఎదుర్కొంటేనే!'' అనుకున్నాడు కాసేపు.

లేదు..లేదు..డాక్టర్ దగ్గరకు వెళితే ఏవేవో రోగాలు తనలో ఉన్నాయని చెబుతాడు. అది తను భరించలేడు. రోగాలన్నీ ముదిరిపోయాయని తన చేయిదాటిపోయిందని చెబుతాడు. అదీ తను భరించలేడు. అందువలన తను డాక్టర్ దగ్గరకు వెళ్లకూడదు.' అంటూ మరోసారి తీర్మానించుకున్నాడు.

చివరికి ఆ రోజు డ్యూటీకి వెళ్లకుండా సెలవు తీసుకుని ఇంటిలోనే ఉండిపోయాడు.

ఆ మరుసటిరోజు శరత్‌చంద్రకు జ్వరం వచ్చింది. దానితో చాలా కంగారుపడిపోయాడు.

తను అనుకున్నంతా అయింది. తనలోని అన్నివ్యాధులూ బాగా ముదిరిపోయి ఉంటాయి. అందుకే చివరిదశలో జ్వరంకూడా వచ్చింది. ఇప్పుడు ఏమిటిచెయ్యడం?'' అంటూ ఆలోచనాసముద్రంలో మునిగిపోయాడు- శరత్‌చంద్ర.

ఆరోజు సాయంత్రానికి జ్వరం మరీ ఎక్కువైంది. దానితో అతని ఆందోళన ఆకాశాన్నంటింది.

'ఇక ఈ జ్వరం తనకు తగ్గదేమో! తనలోని అన్ని వ్యాధులూ ఇప్పుడు బయటపడిపోతాయి. తను ఈ వ్యాధులతో ఎక్కువకాలం బ్రతకడు. అది తథ్యం. ఇందులో అనుమానమేమీ లేదు. తను జీవిత చివరిదశలో ఉన్నాడు.' అనుకుంటూ చెమర్చిన తన కళ్లను కర్చీఫ్‌తో తుడుచుకున్నాడు.

ఇంతలో డోర్ బెల్ మ్రోగింది. నీరసంగా లేచివెళ్లి తలుపు తెరిచాడు. ఎదురుగా అతని స్నేహితుడు రమణ!

''రమణా...వచ్చికూర్చో..'' అంటూ నీరసంగా పలికాడు.

''ఏమిటలా నీరసంగా ఉన్నావు? జ్వరం వచ్చిందా ఏమిటి? అంటూ నుదుటి పై చెయి వేసి చూసాడు రమణ.

'అరె బాగా జ్వరంగా ఉందే. డాక్టర్ దగ్గరకు వెళ్లలేదా?'' అంటూ కంగారుగా అడిగాడు:

''లేదు..'' అని బదులిచ్చాడు శరత్‌చంద్ర.

''ఎందుకలా? పద...నేను తీసుకెళతాను..'' అంటూ...శరత్‌చంద్ర ఎంత వద్దంటున్నా వినకుండా డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్లాడు రమణ.

డాక్టర్ అతన్ని పరీక్షించి ... ఏవో మందులు రాసిన ప్రిస్క్రిప్షన్ శరత్‌చంద్ర చేతిలో పెట్టాడు.

''ఏమిటిసార్? ప్రాబ్లమ్ ఏమిటి..'' అని అడిగాడు రమణ డాక్టర్‌ని.

''నో ప్రాబ్లమ్...మామూలు జ్వరమే. ఈ మందులు వాడితే జ్వరం రెండు రోజులలో కంట్రోల్ అవుతుంది.'' అన్నాడు డాక్టర్.

అనుమానంగా అక్కడే నిలబడ్డాడు శరత్‌చంద్ర.

''ఏమిటి చెప్పండి ఏమిటి మీ అనుమానం?'' ప్రశ్నించాడు డాక్టర్.

రమణ ఆశ్చర్యంగా శరత్‌చంద్ర వైపే చూస్తున్నాడు.

''డాక్టర్! నాకు ఒక్క జ్వరమే కాదు. ఇంకా చాలా సమస్యలున్నాయి.'' అంటూ చెప్పలేక చెప్పలేక చెప్పాడు శరత్‌చంద్ర.

''ఏమిటవి చెప్పండి...'' అన్నాడు డాక్టర్.

''నాకు తరచూ తలనొప్పివస్తూ వుంటుంది. అది చాలా తీవ్రంగా వస్తోంది. బహుశా బ్రెయిన్ ట్యూమర్ అయి ఉంటుంది. అలాగే గొంతునొప్పి కూడా ఉంది డాక్టర్. అదీ సివియర్‌గానే వుంది. బహుశా అది గొంతు కేన్సర్ అయి ఉంటుంది. అలానే ఇంకా వేళ్లు మొద్దుబారిపోవడంలాంటి సమస్యలు కూడా ఉన్నాయి. అందువలనే ఈ జ్వరం వచ్చిందనుకుంటున్నాను.'' అన్నాడు శరత్‌చంద్ర.

''నో శరత్‌చంద్ర! మీ అనుమానాలన్నీ నిజం కాదు. మీరు అనవసరంగా ఏవేవో ఊహించుకుని అలా ఫీలవుతున్నారు. నిజానికి మీకు ఏ జబ్బూలేదు. మీలో అదొకరకమైన ఫోబియా...అంటే భయం బయలుదేరి అలా ఆలోచిస్తున్నారు. మీకు ఏ అనారోగ్యమూ లేదు. ఇది మామూలు జ్వరమే..'' అన్నాడు డాక్టర్.

''మరి నా సమస్యలన్నిటికీ కారణం?'' అడిగాడు శరత్‌చంద్ర.

''మీకు రక్తహీనత ఉంది. దానివలన మీలో కొన్ని బలహీనతలు కన్పిస్తున్నాయి. మీరు చెప్పిన సమస్యలన్నీ రక్తహీనతకు సంబంధించినవే. నేను వ్రాసిన మందులు వాడితే అదీ తగ్గిపోతుంది. మీరు అనవసరంగా కంగారుపడుతున్నారు. మీలో సింపుల్ అనీమియా మాత్రమే ఉంది.'' అన్నాడు డాక్టర్ చిరునవ్వుతో.

శరత్‌చంద్రలోని అనుమానాలన్నీ పటాపంచలై మటుమాయమయ్యాయి. ఎక్కడలేని రిలీఫ్ శరత్‌చంద్రను ఆవహించింది.

'తను అనవసరంగా ఏవేవో ఊహించుకొని భయాందోళనలకు గురి అయ్యాడు. నిజానికి తాను ఎంతో ఆరోగ్యవంతుడు. ఏ ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే డాక్టర్ సలహా తీసుకోవాలిగానీ, ఇలా స్వంత నిర్ణయాలు తీసుకుని జీవితాన్ని నరకం చేసుకోకూడదు. ఇటువంటి తప్పు మరెప్పుడూ చేయకూడదు.' అనుకుంటూ గట్టి నిర్ణయం తీసుకున్నాడు శరత్‌చంద్ర.

అలా అనుకున్నాక..అతనికి ఎక్కడలేని ధైర్యం వచ్చింది. చిరు దరహాసం అతని పెదవిపై చోటుచేసుకుంది. ఇప్పుడతనెంతో ఉత్సాహంగా కన్పిస్తున్నాడు....

★

